
# ఉపశమనం



వి. రాజా రామమోహనరావు

"అదోరకం ఆకర్షణ.." అన్నాడు విశ్వం, నేనుకాక ఆగదిలో యింకో నలుగురున్నారు. అందరిపని మంచి హుషారుగా వుంది.. మా యిద్దరి స్నేహం ముప్పై ఏళ్ళలో ఎన్నో ఆటుపోట్లు తట్టుకుంది. వయసు ఎంత ఎదుగుతున్నా మేం యిద్దరం కలిసున్నప్పుడు మాత్రం చిన్నతనం లాగే వుంటుంది.

అలా అన్న విశ్వం ముఖంలో వింత కాంతి కనిపించిది నాకు. విశ్వం గతంలో చాలాసార్లు చాలామంది స్త్రీల గురించి చెప్పాడు. కానీ యీసారి .... యిప్పుడు చెపుతున్న కరుణ అన్న యీ అమ్మాయి విషయం చెప్పినప్పుడు వాడి గొంతులో పలికిన ధ్వని గతంలో నేనెప్పుడూ వినలేదు.

ముందునుంచీ డబ్బున్న విశ్వానికి యీ మధ్య తలపెట్టినవన్నీ కలిసొచ్చి చాలా డబ్బు చేరింది. సహజంగా తన చుట్టూ జనం వుండటమంటే యిష్టపడే వాడికి, వీలున్నంతగా స్త్రీల సహచర్యం అంటే యిష్టం.

ఎవరికీ చెరుపు కలిగించని వాడి స్త్రీ లోలత్వం నా కెప్పటినుంచో పరిచయం వున్నదే.

'స్త్రీతో, ఎంతోయిష్టంగా గడపటం ఎంత తృప్తో .... ఆ తర్వాత వెలకట్టినట్టు ఎంతోకొంత డబ్బు యివ్వడం అంత యిబ్బందిరా ...' అని చాలాసార్లు చాలా సందర్భాలలో అన్నాడు. మాటవరసకి వాడు అలా అనటం కాదు. స్త్రీల విషయంలో వాడి ప్రవర్తన, వాడి భావన విధానం స్త్రీతో అనుభవానికి డబ్బు యిచ్చినా వెలకట్టినట్టు మొరటుగా కనిపించకుండా ఎవరి ద్వారానో ముందుగానే అందచేసే సున్నితత్వం నాకు తెలిసున్నదే!

తను వెళ్ళే స్త్రీల దగ్గరి అనుభవాన్ని ఎంత ఉన్నతంగా భావిస్తాడో, వారి దగ్గరికి అలా వెళ్ళటంతో పద్ధతి, వారి ఆ పరిస్థితికి అంతగానూ బాధపడతాడు. చాలామందికి అది పనికిరాని సెన్సిటివ్‌నెస్ అనిపించొచ్చు కాని కొన్ని మనస్తత్వాలు మారవు.

'జీవితంలో యిన్ని అనుభవాలతో యింత దూరం వచ్చావు.. ఇప్పటికేనా పెళ్ళిచేసుకోకూడదూ...' అని చాలా సార్లు.... వీలున్నన్ని సార్లు చెప్పాను.

విశ్వం వినడని తెలుసు ... తెలిసీ చెప్పడం.

విశ్వాన్ని వదిలేసి విడాకులు తీసుకుని వాడి భార్య వెళ్ళిపోయి అప్పుడే పదేళ్ళు దాటింది. ఆ అమ్మాయి నాకు తెలిసున్న అమ్మాయే. ఇద్దరూ మంచివాళ్ళే. యిద్దరికీ పరస్పరం యిష్టమే. అయినా విడిపోయారు. ఇదీకారణం అని ఖచ్చితంగా చెప్పలేని అనేకానేక కారణాల వల్ల విడిపోయారు. అదీ పెళ్ళయిన ఏడాది తిరక్కుండానే విడిపోయారు.

వాళ్ళిద్దరూ విడిపోటానికి కారణాలుగా ఎన్నో సార్లు వాడు ఎన్నో విషయాలు చెప్పాడు. నా వరకూ నాకు అవేవి పెద్ద కారణాలు అనిపించకపోయినా వాడికి అవి చాలా పెద్ద విషయాలు.

ఏది ఏమైనా పరస్పర నిందలతో కాకుండా యిద్దరికీ సరిపడలేదన్న నిర్ణయంతోటే వాళ్ళిద్దరూ విడిపోటం చాలావరకు నయం.

విఫలమైన వివాహజీవితమో ... విలక్షణమైన మనస్థత్వమో కానీ ఆ తర్వాత జీవితంలో విశ్వం చాలామంది ఆడవాళ్ళకి దగ్గరయ్యాడు కానీ ఏ స్త్రీని తనకి మరీ దగ్గరగా రానివ్వటం లేదు.

ఎప్పుడు వాడు ఏ స్త్రీ గురించి ఒకటికి రెండుసార్లు మాట్లాడినా నాకు ఓ చిన్న ఆశ. వివాహ జీవితంలోనే ఆడమగ స్థిరపడితేనే జీవితం సజావుగా వుంటుందన్న సంప్రదాయ భావ ప్రభావం కొంత. (గతం తెలిసున్న దే అయినా ఆలోచనలోకి ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు వదులుతుందో అర్థంకాని మిస్టరీ.)

నేను గతంలోంచి బైట పడే టప్పటికి... "ఒరే యింత గొప్పగా చెపుతున్నావు. కరుణని ఒక్కసారిగామాక్కూడా చూపించరా .... ఊరికే, చూసి వచ్చేస్తాం..." అంటున్నారు నలుగురూ ఏకకంఠంతో ఆ. నలుగురూకూడా మాకు దగ్గిర స్నేహితులే.

విశ్వం సరేనంటాడని నాకు తెలసు. అక్కడ ఏఅల్లరి చెయ్యకూడదని పదేపదే జాగ్రత్తచెప్పి ఆ రాత్రికే వాళ్ళని తన కూడా తీసికెళ్ళటానికి ఒప్పుకున్నాడు విశ్వం. నన్నూ రమ్మన్నాడు, వెళ్ళాలని వున్నా వెళ్ళలేక పోయాను.

కానీ ఆ మర్నాడు అలాజరుగుతుందని .. నేను అలా చేస్తానని ఊహా మాత్రంగానేనా అనుకోలేదు.

కరుణ అందాన్ని ఆ నలుగురు నాలుగు రకాలుగా చెప్పారు. కేవలం ఆ అమ్మాయిని చూసివచ్చి నందుకే వాళ్ళల్లో ఉద్విగ్నత వెలుగుతోంది.

ఒకటి రెండు రోజాలకన్నా ఎక్కువ పరిచయం ఏ స్త్రీతోటి కొనసాగించని విశ్వం గత పదిహేనురోజులగా కరుణతోటే గడుపుతున్నాడు. 'ఏమిటిరా ప్రత్యేకత అంటే...'అదో రకం ఆకర్షణరా...' అంటాడు తప్ప యీ నలుగురూ చెప్పినన్ని వివరాలు కూడా చెప్పటంలేదు. నలుగుర్ని తరచి తరచి అడిగితే బైటపడిన విషయం కొంచం మొరటుగా వుంది. బాధాకరమైంది కూడా!.

'ఆ యింట్లో ఆ అమ్మాయి ఒక్కత్తే ..... ఒక గది, చిన్న వంటిల్లు ... అంతే యిల్లు ... అమ్మాయి అందమైందే! సందేహంలేదు కానీ వ్యాపారం చేసుకుంటున్న ఆడాళ్ళలో యింత కన్నా అందమైన వాళ్ళు చాలామంది వున్నారు. ఎటొచ్చీ ఎవరేనా వచ్చి వ్యవహారం స్థిరపడగానే ఆ అమ్మాయితండ్రి నిశ్శబ్దంగా తలుపు దగ్గరకేసి వెళ్ళిపోతాడు. ఆయన ఆ అమ్మాయి తండ్రి అనటానికి సందేహంలేదు. ఇద్దరూ తండ్రీ కూతుళ్ళనీ చూడగానే పోలికల బట్టి స్పష్టంగా తెలుస్తుంది. ఆ తండ్రీ కూతురు పరస్పరం ప్రాణంగా వుంటారన్న వాళ్ళ చూపుల్ని బట్టి ఎవరికేనా తెలుస్తుంది.

తండ్రి తన కూతుర్ని అలా వదిలేసి తలుపు దగ్గరకి వెయ్యటంలో వింత ఆకర్షణ... అంతే మరేం స్పెషాలిటీలేదు . అన్నది రకరకాలమాటల్లో నలుగురూ వెలిబుచ్చిన అభిప్రాయం.

విశ్వంతో కలిసి ఆ రాత్రి నేను కరుణ యిల్లు చేరేవరకు నాకు అది మెలకువున్న కలలాంటి అనుభవం.

నేను కరుణని చూట్టం మాట్లాట్టం, విశ్వం కరుణ పరస్పర ఆకర్షణ దగ్గరి తనాల స్పర్శ.... అన్నీ అలాగే కలలా వున్నాయి.

పేటలో వుండాల్సిన యిల్లు కాదది. చిన్న పెంకుటిల్లు. ఇంటి ముందు అరుగుకూడా వుంది. ఆ అమ్మాయి కరుణ కూడా అలాగే ఆ వృత్తికి నప్పిన మనిషిలా లేదు.

మేం వెళ్ళి అయిదు నిముషాలు గడవలేదు. కరుణ తండ్రి లేచాడు వెళ్ళటానికన్నట్టు. గబుక్కుని నేనూ లేచాను. అప్రయత్నంగానే ఆయన దగ్గరికి చేరి ... 'మీకు అభ్యంతరం లేకపోతే మీ కూడా నేను వస్తాను.' అన్నాను.

చాలాసాడిగా .. 'రండి' అన్నాడు.

ఆయనతో పాటే నడుస్తున్నాను: నిర్ధారిత గమనంలా నడుస్తున్నాడాయన. పట్టుమని వందగజాలు కూడా వెళ్ళలేదు. ఆ బార్ ముందు నిలబడ్డాడాయన.

"నేను తాగుతాను. మీరు రాగలిగితే రండి" అన్నాడు.

ఇద్దరం లోపలికి వెళ్ళి కొంచం స్థిమిత పడ్డాం. నాయిబ్బంది గమనించినట్టు ఆయనే మాట్లాడుతూ వచ్చాడు. రకరకాల విషయాల గురించి ఆయన సూటిగా స్పష్టంగా మాట్లాడుతున్నా, దేన్నో తన దృష్టిలోంచి దూరంగా వుంచటానికి మాట్లాడుతున్నట్టున్నాయి ఆ మాటలు.

ఏదేదో తెలుసుకోవాలన్న తపన, ఏం మాట్లాడలేని అస్థిమితం నన్ను యిబ్బంది పెడుతూనే వున్నాయి.

కరుణ తండ్రి ... ఆయన్ని ఆయన విభాయించుకుంటున్న తీరు చాలా నిండుగా ... చిత్రంగా వుంది. జరుగున్నదానికి, కరుణ విషయో ఆయనచేస్తున్నదానికి ఎంతమాత్రం సమర్థన కానీ, చిన్నతనం కానీ ఆయన మాటల్లో, చేతల్లో ఎక్కడా కనిపించటంలేదు.

ఎంతో నేర్పుగా ఆయన్ని ఏమాత్రం యిబ్బంది పెట్టకుండా ప్రవర్తించాలన్న నా నియంత్రణ నాకే అస్థిమితంగా వుంది. తట్టుకోలేక మరో అరగంట తర్వాత బైటపడిపోయాను.

'ఆర్థికంగా యిబ్బంది వుంటుందని నాకు తెలుసు... అయినా మరో గది వున్న కొంచెం పెద్ద యిల్లు తీసుకుంటే మీరు యిలా బైటికి వచ్చేసే యాతన తప్పుతుంది కదా .. ,అన్నాను నేను. అడుగుదామనుకున్నది వేరని నాకే తెలుస్తోంది.

కరుణని చూసి వచ్చాక మా స్నేహబృందం నలుగురు వెలిబుచ్చిన అభిప్రాయం విషయంలో నాకు సందేహనివృత్తి కావాలి. కరుణ పట్ల విశ్వం ఆకర్షణకి ఆ తండ్రి అలా వచ్చేయటం అన్నది విషయమే కాదని నాకు తెలుసు. అయినా ఎందుకో ఆ విషయం తాలూకు వివరాలు కావాలి.

"మేం వుంటున్న యిల్లు అద్దె యిల్లు కాదు. నా సొంత యిల్లు ... పేరుకే లెండి... ఆ యింటికి మించిన అప్పులున్నాయి. నాగత జీవితంలాగే ఆ యిల్లు నన్నొదలటం లేదు. నేనొదులుకోలేక పోతున్నాను. మీ ఉద్దేశం నాకు అర్థమైంది. మరోగది వుంటే తీరిపోయే యిబ్బంది కాదండి యిది.

మనిషి కొన్ని ఆశలకి, అందాలకి బందీ.. నాకు సంగీతం ఆశ, సినిమాలు ఆశ... అందుకే యీ సినీనగరం వదలలేక యిలాఅయిపోయాను. నా ఆశలు, నిరాశలు నా వరకే ఆగలేదు. నా ఒక్కగానొక్క కూతురి వరకూ వచ్చాయి. జీవితంలో నాకు చాలా సందేహాలున్నాయి. నా కరుణని నేనే యీ దిశగా ప్రోత్సాహించానా లేదా అన్నది నాకే స్పష్టంగా తెలియదు. కరుణలో యీరకం ఆశలు తలెత్తినప్పుడు ఖండించలేదు...ప్రస్తుతం ఫలితం యిది...

యిదో తప్పని విషం.... రోజూ నాకు తాగక తప్పదు. అక్కడున్నా, ఆయింటి నుంచి దూరంగా వున్నా నేను తండ్రినే నా కరుణ కాలికి దెబ్బతగిలినా, వేలునెప్పెట్టినా అప్పుడూ, యిప్పుడూ నా బాధ నాదే... తప్పని అసమర్థత... మనసు మెత్తదనాన్ని చాలా ఏళ్ళు చంపుకోలేక పోయాను .... యిప్పుడు యీ పరిస్థితులకి అదే నెమ్మది నెమ్మదిగా చచ్చి పోతోంది. .. 'అయినా యింకా ఏదో వెర్రి తాపత్రయం..'

ఆ బార్ లైట్లలో ఆయన కళ్ళు వెలుక్కి ముందు వేపున్నాయి. నాకు స్పష్టంగా కనపడటంలేదు. అయినా ఆ తండ్రి మనసు తడి తెలుస్తోంది. అగ్ని కీలలా ఆ తడి నన్నుతాకుతోంది.. తప్పనిసరో.. ఎందుకో తెలియకుండానే మరో గంట కూచున్నాం.

తండ్రి కూతురుతో వ్యాపారం చేయటం... అందులో రకరకాల మెళకువలు అన్న విషయాలు నేను చాలా సార్లు విన్నాను. అవన్నీ నిజాలైనా అబద్ధాలైనా వాటి విలువ ఒక్కటే..

తిరిగి నేనూ విశ్వమే కలిసి తిరిగి వస్తున్నాం.

"ఎందుకోరా కరుణని వదలుకోలేక పోతున్నాను ..." అన్నాడు విశ్వం.

"పోనీలేరా .. యిప్పుడు నష్టమేముంది." అన్నాను.

ఆమాట మన స్ఫూర్తిగానే అన్నాను.

పూర్తి తృప్తి అని కాదు గానీ ..వోరకమైన అస్థిమితం తొలగిపోయింది. ఆ తండ్రి ... కరుణ ... విశ్వం ...వాళ్ళు అంత యిబ్బందిలోనూ సజావుగానే తోస్తున్నారు.

నా తృప్తి నావరకే మరొకరికి అందించ గలిగింది అవునో కాదో .. మనసులో చల్లటి మంచు తెరలాంటి అస్పష్ట స్థితి... అయినా బాగానే వుంది.

